క్లుప్తంగా

బాధితుడికి ఎల్‌ఓసీ అందజేత



పెబ్బేరు రూరల్‌: మండలంలోని గుమ్మడంకు చెందిన చంద్రమ్మ అనారోగ్య సమస్యతో బాధ పడుతూ హైదరాబాద్‌లోని నిమ్స్‌ ఆస్పత్రిలో చికిత్స పొందుతుంది. ఆమె సీఎం సహాయ నిధి కోసం దరఖాస్తు చేసుకుంది. ఈ విషయాన్ని గ్రామానికి చెందిన నాయకులు రాష్ట్ర ప్రణాళిక సంఘం ఉపాధ్యక్షుడు జిల్లెల చిన్నారెడ్డి దృష్టికి తీసుకెళ్లారు. వెంటనే స్పందించి ఎల్‌ఓసీని మంజూరు చేయించారు. మంజూరైన రూ.2.50లక్షల ఎల్‌ఓసీ కాపిని ఆదివారం వనపర్తిలోని వారి ఇంటి వద్దకు రాష్ట్ర ప్రణాళిక సంఘం ఉపాధ్యక్షుడు జిల్లెల చిన్నారెడ్డి బాధితురాలి భర్త పెద్దరాములుకు అందజేశారు. కార్యక్రమంలో హరికుమార్‌రెడ్డి, కృష్ణయ్య, గొల్ల రాముడు, కురుమయ్య తదితరులు పాల్గొన్నారు.

కార్యకర్తలకు కష్టం రానీయం

గోపాల్‌పేట: కార్యకర్తలకు ఎటువంటి ఇబ్బందులు రాకుండా చూసుకుంటామని రాష్ట్ర ప్రణాళికా సంగం ఉపాధ్యక్షుడు చిన్నారెడ్డి అన్నారు. బుద్దారానికి చెందిన ఎల్లగౌడ్‌ కొన్ని రోజులుగా అనారోగ్యానికి గురై ఇటీవల ఆపరేషన్‌ చేయించుకున్నాడు. ఆదివారం చిన్నారెడ్డి ఎల్లగౌడ్‌ ఇంటికి వెళ్లి పలకరించి ఆయన బాగోగులు తెలుసుకున్నాడు. ఎటువంటి ఇబ్బంది ఉన్నా తన దృష్టికి తీసుకురావాలని, ఏ ఇబ్బందైనా అండగా ఉంటానని భరోసా ఇచ్చారు. ఆయన వెంట జిల్లా అధ్యక్షుడు రాజేంద్రప్రసాద్‌ యాదవ్‌, మెట్టిపల్లి రాములు, ప్రవీణ్‌ కుమార్‌రెడ్డి తదితరులు ఉన్నారు.

స్నేహితుడికి చేయూత



మదనాపురం: మండలంలోని దుప్పల్లికి చెందిన 1995–96లో పదో తరగతి పూర్తి చేసిన విద్యార్థులు తమ తోటి స్నేహితుడికి ఆదివారం ఆర్థిక సాయం అందించి తమ ఔదార్యాన్ని చాటుకున్నారు. గ్రామానికి చెందిన సి.శేఖర్‌ మదనాపురంలో నివాసం ఉంటూ.. కార్పెంటర్‌గా పని చేస్తున్నాడు. ఇటీవల పనిచేస్తున్న సమయంలో మిషన్‌లో చేయి పడి తీవ్రంగా గాయపడ్డాడు. విషయం తెలుసుకున్న మిత్రులందరూ తమ స్నేహితుడిని ఆర్థికంగా ఆదుకోవాలని ముందుకు వచ్చారు. రూ20 వేలను అందించారు. కార్యక్రమంలో భానుప్రకాశ్‌, ఎస్‌.సురేశ్‌, ఎస్‌.నర్సింహ, పి.వెంకటేశ్‌, సి.చంద్రశేఖర్‌, మాసన్న, బి.రాములు, తదితరులు ఉన్నారు.

చెరువుకట్టపై రక్షణ గోడ నిర్మించండి



వీపనగండ్ల: మండల కేంద్రానికి సమీపంలోని కామదేనుపల్లి చెరువుకట్టపై ప్రమాదభరితంగా మలుపు ఉండటం, రక్షణ గోడ లేకపోవడంతో ప్రమాదం పొంచి ఉందని గ్రామాల ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. మండల కేంద్రం నుంచి పెబ్బేరు పట్టణానికి వెళ్లే ప్రధాన రహదారి కావడంతో ద్విచక్ర వాహన దారులు రాత్రి వేలలో కూడా ఈ రహదారి వెంట ప్రయాణిస్తుంటారు. కొద్దిపాటి అదుపు తప్పితే చెరువులో పడి ప్రాణాలు కోల్పోయే పరిస్థితులు నెలకొన్నాయని గోపల్‌దిన్నె, గోవర్ధనగిరి, రంగవరం, వీపనగండ్ల గ్రామాల ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఉన్నతాధికారులు స్పందించి చెరువుకట్టకు ఇరువైపులా రక్షణ గోడ నిర్మించాలని కోరుతున్నారు.

నిర్లక్ష్యానికి నిదర్శనం..



పాన్‌గల్‌: మండల కేంద్రంలోని ఎమ్మార్సీ కార్యాలయం ఎదుట ఉన్న సమాచారం బోర్డుపై అధికారులు, ప్రజాప్రతినిధులు మారినా.. నేటికి వారి పేర్లు మార్చక పోవడంపై విద్యాశాఖ నిర్లక్ష్యానికి నిదర్శనంగా కనిపిస్తుందని పలువురు వాపోతున్నారు. బోర్డుపై గవర్నర్‌, సీఎం, విద్యాశాఖ మంత్రి, విద్యాశాఖ ముఖ్య కార్యదర్శి, కమిషనర్‌, డైరెక్టర్‌ ఆఫ్‌ స్కూల్‌ ఎడ్యుకేషన్‌ అధికారులు, కలెక్టర్‌, జిల్లా విద్యాశాఖ అధికారి వంటి పేర్లు మార్చకపోవడంతో పాతవే దర్శనమిస్తున్నాయి. ఇప్పటికైనా.. విద్యాశాఖ అధికారులు స్పందించి బోర్డుపై మారిన పేర్లను ముద్రించాలని పలువురు కోరుతున్నారు.

పేకాటరాయుళ్ల అరెస్ట్‌

పెబ్బేరు రూరల్‌: పెబ్బేరు పట్టణ శివారులో పేకాట ఆడుతున్న 11 మందిని ఆదివారం అరెస్టు చేసినట్లు ఎస్‌ఐ హరిప్రసాద్‌రెడ్డి తెలిపారు. విశ్వసనీయ సమాచారం మేరకు సిబ్బందితో కలిసి పేకాట స్థావరంపై దాడి చేసి వారి నుంచి రూ. 10,800 నగదు, 8 సెల్‌ఫోన్లు, 3 బైకులు స్వాధీనం చేసుకొని పోలీస్‌స్టేషన్‌కు తరలించామన్నారు.

ఆశాజనకంగా ఆరుతడి సాగు

- మండలంలో 1,528 ఎకరాల్లో ఇప్పటి వరకు మెట్టపంటలు
- అత్యధికంగా 865 ఎకరాల్లో పత్తి సాగు
- ముమ్మరంగా పత్తి కలుపుతీసే పనులు



ఖిల్లాఘనపురం మండలం అప్పారెడ్డిపల్లిలో పత్తి పంటలో కలుపుతీస్తున్న కూలీలు

ఖిల్లాఘనపురం: మండలంలో ఇప్పటివరకు సాగు చేసిన మెట్టపంటలు ఆశాజనకంగా ఉన్నాయి. ముఖ్యంగా మండలంలో వరి తరువాత అత్యధికంగా సాగు చేసే పత్తి పంటలు సాళ్లువారి ఉన్నాయి. మొదటి వర్షానికే దుక్కులు సిద్ధం చేసుకున్న రైతులు ఓట్టి పదును దుక్కుల్లో పత్తి విత్తనాలను నాటుకున్నారు. ఆ తరువాత కురిసిన వర్షాలకు 80 శాతం విత్తనాలు మొలకెత్తాయి. గతంలో రెండు, మూడు మార్లు విత్తనాలు విత్తుకునే వారు. ఈ సంవత్సరం ఒకే సారి విత్తిన విత్తనాలు 80 శాతం మొలకెత్తడంతో రైతులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. అదేవిధంగా మండలంలోని పలు గ్రామాల్లో సాగు చేసిన ఇతర పంటలు జొన్న, మొక్క జొన్న, కంది తదితర పంటలు కూడా మొలకెత్తడంతో ముమ్మరంగా కలుపుతీయుట, ఎరువులు వేసే పనుల్లో రైతులు నిమజ్ఞమయ్యారు.

సాగు మరింత పెరిగే అవకాశం

మండలంలో పత్తితో పాటుగా జొన్న, మొక్క జొన్న తదితర పంటలు మొత్తం 1,528 ఎకరాల్లో ఇప్పటి వరకు సాగు చేశారని మండల వ్యవసాయ అధికారి మల్లయ్య తెలిపారు. ఇప్పుడు వర్షాలు కురిసిన సాగు మరింత పెరిగే అవకాశం ఉందన్నారు. ముఖ్యంగా మండలంలోని అల్లమాయపల్లి, మల్కిమియాన్‌పల్లి, హీర్లతండా, అప్పారెడ్డిపల్లి, సల్కెలాపురం, మామిడిమాడ, పర్వతాపురం తదితర గ్రామాల్లో మొత్తం 863 ఎకరాల్లో పత్తి పంట సాగు చేశారు.

చక్కగా మొలకెత్తాయి..

మండలంలో వరి తరువాత ఎక్కువగా పత్తి పంటలు సాగు చేస్తారు. పత్తి పంట విత్తుకున్న సమయంలో పెద్ద వర్షాలు కాకుండా మోస్తరు వర్షాలు కురవడంతో విత్తనాలు చక్కగా మొలకెత్తాయి. ప్రస్తుతం రైతులు కలుపుతీయడం, దంతెలు తోలడం, ఎరువులు వేసే పనుల్లో ఉన్నారు.

– మల్లయ్య, మండల వ్యవసాయ అధికారి, ఖిల్లాఘనపురం

మండలంలో వివిధ రకాల మెట్ట పంటలు సాగు వివరాలు

పంట రకం	పంట సాగు ఎకరాల్లో
పత్తి	863
జొన్న	312
మొక్క జొన్న	193
కంది	93
ఆముదం	65





ఆముదంబండతండాలో సాగు చేసిన జొన్న పంట



మల్కిమియాన్‌పల్లిలో ఎరువులు వేస్తున్న కూలీలు



ఖిల్లాఘనపురంలో ఓ రైతు సాగు చేసిన పత్తి పంట

దడపుట్టిస్తున్న ధరలు



మదనాపురం: కూరగాయల సాగు తగ్గిపోవడంతో పాటు, డిమాండ్‌కు తగిన దిగుమతి లేకపోవడంతో ధరలు రోజురోజు ఆకాశం అంటుతున్నాయి. ఇప్పటికే టమాటా, పచ్చిమిర్చి కిలో రూ.100 పైగా దాటింది. మిగతా కూరగాయలు రూ.100 దగ్గరలో ఉన్నాయి. కొంతకాలంగా నిత్యావసర సరుకుల ధరలు పెరుగుతుండటంతో సామాన్యులపై పెను భారం పడుతుంది. ప్రస్తుతం ధరలు పెరిగి మరింత భారం అవుతుంది. ఇప్పటికే ఉల్లిపాయల ధరలు పెరగడంతో తాజాగా టమాట పచ్చిమిర్చి కూరగాయలు పెరిగి సామాన్యులను ఇబ్బందికి గురి చేస్తోంది. దీంతో వినియోగదారుల గుండెలు గుబులుమంటున్నాయి. నిత్యావసరకుల సరుకుల ధరలు, కూరగాయలు కొనుగోలు చేయాలంటే పేద మధ్యతరగతి కుటుంబాల నెలవారి వేతనాలు కూడా సరిపోవడం లేదని ఆందోళన చెందుతున్నారు. జూన్‌ మాసంలో విద్యాసంస్థలు ప్రారంభం కావడంతో విద్యార్థులకు పాఠ్యపుస్తకాలు, ఫీజులు చెల్లించడమే భారంగా భావిస్తున్న క్రమంలో నిత్యావసర కూరగాయల ధరలు చూస్తే మార్కెట్‌కు వెళ్లాలంటే భయం కలుగుతుందని ప్రజల ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి పెరిగిన కూరగాయల ధరలు తగ్గించాలని ప్రజలు కోరుతున్నారు.

కూరగాయాల ధరలు కిలో రూపాయలల్లో..

పచ్చిమిర్చి	100
టామటా	100
బెండకాయ	60
బీరకాయ	80
బీర్‌నీస్‌	80
చిక్కుడు	80
వంకాయలు	60
పాలకూర	10
కొత్తిమీర	50

కిలో పచ్చిమిర్చి రూ.100



పచ్చిమిరపకాయల ధరలు కిలో రూ.100 అమ్ముతున్నారు. అదే విధంగా కూరగాయల ధరలు పెరిగాయి. ఎప్పుడు చూడలేదు. ప్రతి కూరగాయల్లో టమాటాలు, పచ్చిమిరపకాయలు వాడుతాం. ఇలాంటి పరిస్థితుల్లో ఏం కొనుగోలు చేయాలన్నా ఇబ్బందిగా ఉంది. ప్రభుత్వం స్పందించి ధరలు తగ్గించాలి.

– భారతి గృహిణి అమరచింత

ఇబ్బందులు ఎదుర్కొంటున్నాం..



నిత్యావసర వస్తువుల ధరలు విపరీతంగా పెరగడంతో మాలాంటి మధ్యతరగతి ప్రజలపై ఇబ్బంది పడుతుంది. కొన్ని రోజులుగా ధరలు మండుతున్నాయి. కూరగాయలు కొనుగోలు చేసేందుకు మార్కెట్‌కు భయం వేస్తుంది. ప్రభుత్వం స్పందించి తక్షణమే నిత్యావసర వస్తువుల ధరలు తగ్గించాలి. లేదంటే మా లాంటి పేదలపై భారం పడే అవకాశాలు ఉన్నాయి.

– లాల్‌కోట రవి, కొత్తకోట

బాధిత కుటుంబానికి పరామర్శ

పెబ్బేరు రూరల్‌: మండలంలోని రాంపురానికి చెందిన రాచాల పార్వతమ్మ అనారోగ్యంతో మృతిచెందాదు. విషయం తెలుసుకున్న బీఆర్‌ఎస్‌ నాయకులు మాజీ మంత్రి సింగిరెడ్డి నిరంజన్‌రెడ్డి దృష్టికి తీసుకెళ్లారు. ఆయన స్పందించి రూ.5 వేలు పంపించారు. ఆదివారం బీఆర్‌ఎస్‌ మండల అధ్యక్షుడు వనం రాములుయాదవ్‌, స్థానిక నాయకులతో కలిసి గ్రామంలో మృతురాలికి పూలమాల వేసి నివాళి అర్పించారు. బాధిత కుటుంబాన్ని పరామర్శించి వారికి రూ.5 వేల ఆర్థిక సాయం అందించారు. కార్యక్రమంలో స్థానిక బీఆర్‌ఎస్‌ నాయకులు మధు, రాధయాదగిరి, కొండల్‌ యాదవ్‌, గోకారి, లక్ష్మన్న, బీసన్న, చిరంజీవి, నాగన్నయాదవ్‌ తదితరులు పాల్గొన్నారు.

రైతులకు పరిహారం చెల్లించాలి



వీపనగండ్ల: సింగోటం రిజర్వాయర్‌ నుంచి గోపల్‌దిన్నె రిజర్వాయర్‌కు నిర్మించనున్న కాల్వలతో భూములను కోల్పోతున్న రైతులకు వెంటనే పరిహారం చెల్లించాలని సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యులు శ్రీరాం, రమేష్‌, గోపాలకృష్ణ డిమాండ్‌ చేశారు. బొల్లారం, తూముకుంట, సంగినేనిపల్లి, వీపనగండ్ల తదితర గ్రామాల్లోని పంట పొలాల్లో కాల్వల నిర్మాణాన్ని చేపట్టేందుకు అధికారులు సర్వే నిర్వహించి రైతులకు మార్కెట్‌ ధర కంటే మూడింతల పరిహారాన్ని ముందుగానే చెల్లించాలని డిమాండ్‌ చేశారు. గతేడాది కొందరి రైతుల పంట పొలాల్లో తవ్వకాలు జరిపిన అధికారులు ఎలాంటి పరిహారం చెల్లించకపోవడంతో రైతులు పంటలు వేసుకునేందుకు వీలు లేకుండా పోయిందన్నారు. బొల్లారంలో 48 మంది రైతులు తమ భూములను కోల్పోతున్నారని అన్నారు. అధికారులు, ప్రభుత్వం చొరవచూపి రైతులకు ఇవ్వాల్సిన పరిహారపు డబ్బులను వెంటనే చెల్లించి కాల్వ పనులను ప్రారంభించాలని, లేకుంటే రైతులను సమీకరించి ఆందోళన కార్యక్రమాలు నిర్వహిస్తామని హెచ్చరించారు.

అమరచింత ఖ్యాతిని నలుదిక్కులా చాటాలి



మాట్లాడుతున్న మున్సిపల్‌ చైర్‌పర్సన్‌ మంగమ్మ

అమరచింత: ఎంతో చరిత్ర ఉన్న అమరచింత పట్టణ ఖ్యాతిని దేశ నలుదిక్కులా చాటి చెప్పేందుకు వివిధ రంగాల్లో యువకులు ముందుకు సాగాలని మున్సిపల్‌ చైర్‌పర్సన్‌ మంగమ్మ, ఎస్‌ఐ సురేష్‌ కుమార్‌ అన్నారు. ఆదివారం నిర్వహించిన ప్రత్యూష డ్యాన్స్‌ ఇనిస్టిట్యూట్‌ 15వ వార్షికోత్సవ కార్యక్రమంలో వారు ముఖ్య అతిథిలుగా హాజరై మాట్లాడారు. అమరచింత వేదికగా రాష్ట్రస్థాయి డ్యాన్స్‌ పోటీలు నిర్వహించి ఇక్కడికి వచ్చిన వారిని ఆదరించడం ఎంతో గొప్ప విషయమన్నారు. కార్యక్రమంలో కౌన్సిలర్‌ రాజ్‌కుమార్‌, కాంగ్రెస్‌, బీజేపీ పార్టీల నాయకులు తులసీరాజ్‌, మహేందర్‌ రెడ్డి, అరుణ్‌ కుమార్‌, నాగభూషణం గౌడ్‌, మేర్వరాజు నిర్వాహకులు వెంకటేష్‌, సూరి పాల్గొన్నారు.

అంబరాన్నంటిన రైతు సంబరాలు



ఖిల్లాఘనపురం బస్టాండ్‌లో బాణసంచా కాల్చుతున్న కాంగ్రెస్‌ నాయకులు

కొత్తకోట: రాష్ట్రంలోని రైతులకు రూ.2 లక్షల రుణ మాఫీ ఏకకాలంలో చేసేందుకు మంత్రివర్గం ఆమోదం తెలుపడంతో ఆదివారం కొత్తకోట పట్టణ కేంద్రంలో కాంగ్రెస్‌ శ్రేణులు సీఎం రేవంత్‌రెడ్డి, ఎమ్మెల్యే జి.మధుసూదన్‌రెడ్డి చిత్రపటాలకు పాలాభిషేకం చేశారు. పి.ప్రశాంత్‌, శ్రీనివాస్‌రెడ్డి, ఎన్‌జె. బోయేజ్‌, పి.కృష్ణారెడ్డి, పాల్గొన్నారు.

వనపర్తి: మండలంలోని అచ్యుతాపురంలో ఆదివారం మార్కెట్‌ కమిటీ మాజీ సభ్యులు బి. శ్రీనివాస్‌గౌడ్‌, కాంగ్రెస్‌ జిల్లా నాయకులు తిరుపతయ్య సీఎం చిత్రపటానికి పాలాభిషేకం చేశారు.

వనపర్తిటౌన్‌: పట్టణ వర్కింగ్‌ ప్రసిడెంట్‌ కదిరే రాములు ఆధ్వర్యంలో జిల్లా కేంద్రంలోని రాజీవ్‌చౌక్‌లో సీఎం రేవంత్‌రెడ్డి చిత్రపటానికి పాలాభిషేకం చేసి హర్షం వ్యక్తం చేశారు.

పెబ్బేరు రూరల్‌: పెద్దగుడెంలో కాంగ్రెస్‌ నాయకులు, రైతులతో కలసి గ్రామ చౌరస్తాలో సీఎం చిత్రపటానికి పాలాభిషేకం చేశారు. పెబ్బేరు మండల కేంద్రంలోని పట్టణ వీధుల్లో ఎడ్ల బండ్ల ప్రదర్శన చేశారు. శ్రీరంగాపురం మండలంలో మండల కాంగ్రెస్‌ పార్టీ ఆధ్వర్యంలో కాంగ్రెస్‌ నాయకులు, రైతులతో కలిసి అంబేద్కర్‌ చౌరస్తాలో సీఎం చిత్రపటానికి పాలాభిషేకం చేశారు.

గోపాల్‌పేట: బస్టాండ్‌ ఆవరణలో కాంగ్రెస్‌ పార్టీ కార్యకర్తలు, రైతులతో కలిసి సీఎం రేవంత్‌రెడ్డి చిత్రపటానికి క్షీరాభిషేకం చేశారు.

మదనాపురం: ప్రభుత్వం రైతులకు రూ.2 లక్షల రుణమాఫీ నిర్ణయం తీసుకోవడంతో ఆదివారం కాంగ్రెస్‌ మండల నాయకులు బస్టాండ్‌ కూడలిలో సీఎం రేవంత్‌ చిత్రపటానికి పాలాభిషేకం చేశారు.

ఖిల్లాఘనపురం: కాంగ్రె మండల అధ్యక్షుడు విజయ్‌కుమార్‌, వికలాంగుల సంఘం జిల్లా అధ్యక్షుడు గంజాయి రమేష్‌ ఆధ్వర్యంలో ఖిల్లాఘనపురం బస్టాండ్‌లో బాణసంచా కాల్చారు.



గోపాల్‌పేటలో...



శ్రీరంగాపురం చౌరస్తాలో..

మండల స్థాయి గిరకలాగుడు పోటీలు



నగదు బహుమతి అందజేస్తున్న డీసీసీ ప్రధాన కార్యదర్శి అయూబ్‌ఖాన్‌

అమరచింత: ఏరువాక పౌర్ణమిని పురస్కరించుకుని మండలంలోని పాంరెడ్డిపల్లెలో మండల స్థాయి గిరక లాగుడు పోటీలను ఆదివారం నిర్వహించారు. మండలంలోని ఆయా గ్రామాలకు చెందిన రైతులు తమ వృషభాలతో గిరకలాగుడు పోటీల్లో పాల్గొన్నారు. మండల స్థాయి మొదటి బహుమతిని సింగంపేట కైవసం చెసుకోవడంతో నగదు బహుమతిగా రూ.10 వేలను అందించారు. రెండో బహుమతిని ధర్మపురం సాధించి రూ.5 వేల నగదు బహుమతి, మూడు, నాలుగు బహుమతులను పాంరెడ్డిపల్లె గ్రామ వృషాభాలు సాధించడంతో సంబంధిత రైతులకు నగదు ప్రోత్సాహకాలను అందించామని గ్రామ కాంగ్రెస్‌ పార్టీ అధ్యక్షుడు బీసీ రెడ్డి తెలిపారు. బహుమతి ప్రదాతగా టీపీసీసీ రాష్ట్ర అధికార ప్రతినిధి కేశం నాగరాజ్‌ అందించగా డీసీసీ ప్రధాన కార్యదర్శి అయూబ్‌ ఖాన్‌ చేతుల మీదుగా అందించారు. కార్యక్రమంలో కాంగ్రెస్‌ పార్టీ మండల అధ్యక్షుడు మహేందర్‌ రెడ్డి, అరుణ్‌ కుమార్‌ నాయకులు విష్ణు పాల్గొనారు.

కరాటే విద్యార్థులకు బెల్ట్‌ గ్రేడింగ్‌ పరీక్షలు



సర్టిఫికెట్లు, బెల్టులు సాధించిన విద్యార్థులతో సీనియర్‌ కరాటే మాస్టర్లు

కొత్తకోట రూరల్‌: పట్టణ కేంద్రంలోని బాలికల ఉన్నత పాఠశాల ఆవరణలో 'గాడ్స్‌ ఆన్‌ వారియర్స్‌ షోటోఖాన్‌' కరాటే ఆకాడమి ఆధ్వర్యంలో కరాటే విద్యార్థులకు బెల్ట్‌ గ్రేడింగ్‌ పరీక్షలు నిర్వహించినట్లు క్లబ్‌ ఫౌండర్‌ అబ్దుల్‌ నబీ తెలిపారు. ఈ పరీక్షల్లో 16 మంది విద్యార్థులు పాల్గొని అత్యుత్తమ ప్రతిభ కనబర్చడంతో బెల్ట్‌లు, సర్టిఫికెట్లను అందజేశారు. కార్యక్రమంలో సీనియర్‌ కరాటే మాస్టర్లు హరీష్‌యాదవ్‌, జాఫర్‌ సాధిక్‌, బాబా అజ్మీర్‌, కార్తికేయయాదవ్‌, సురేందర్‌, అరవింద్‌, హర్షవర్ధన్‌, పవన్‌తేజ్‌, గౌస్‌పాషా తదితరులు ఉన్నారు.

శ్యాంప్రసాద్‌ ముఖర్జీకి ఘన నివాళి



మదనాపురంలో బీజేపీ నాయకుల నివాళి



అమరచింతలో..

మదనాపురం: జనసంగ్‌ పార్టీ వ్యవస్థాపకులు శ్యాంప్రసాద్‌ ముఖర్జీ బలిదాన్‌ దివాస్‌ సందర్భంగా ఆదివారం మదనాపురం మండల కేంద్రంలోని బస్టాండ్‌ కూడలిలో బీజేపీ మండల నాయకులు ఆయన చిత్రపటానికి నివాళి అర్పించారు. ఆయన చేసిన సేవలను కొనియాడారు. కార్యక్రమంలో బీజేపీ జిల్లా ప్రధాన కార్యదర్శి మాధవరెడ్డి, మండల అధ్యక్షుడు రామకృష్ణారెడ్డి, నాయకులు రాజశేఖర్‌ యాదవ్‌, కృష్ణా యాదవ్‌, రవి, వెంకటేశ్వర శెట్టి, భాస్కర్‌ తదితరులు పాల్గొన్నారు.

అమరచింత: సమైఖ్య భారతం కోసం పోరాడిన మహా యోధుడు డాక్టర్‌ శ్యాం ప్రసాద్‌ ముఖర్జీ అని బీజేవైఎం రాష్ట్ర అధికార ప్రతినిధి మేర్వరాజు అన్నారు. డాక్టర్‌ శ్యాం ప్రసాద్‌ ముఖర్జీ వర్ధంతిని ఆదివారం పట్టణంలో జరుపుకొన్నారు. బీజేపీ జెండా కట్ట వద్ద శ్యాంప్రదసాద్‌ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళి అర్పించారు. కార్యక్రమంలో బీజేపీ నాయకులు నరాల నారాయణ, మరాఠి ఆశోక్‌, భాస్కర్‌, రాకేష్‌ శెట్టి, అనిల్‌, నరసింహులు గౌడ్‌ తదితరులు పాల్గొన్నారు.

భూత్పూరు కాల్వలో పూడికతీత



అమరచింత శివారులో భూత్పూరు కాల్వలో పూడిక తొలగిస్తున్న జేసీబీ

అమరచింత: పట్టణంలోని పెద్ద చెరువుకు సాగు నీటిని అందిస్తున్న భూత్పూరు రిజర్వాయర్‌ కాల్వలో పేరుకుపోయిన పూడికతీతతో పాటు ముళ్లపొదలను మాజీ అడ్వకేట్‌ జనరల్‌ దేశాయి ప్రకాష్‌ రెడ్డి సొంత డబ్బులతో పనులను చేపడుతున్నారు. వర్షాకాలం ప్రారంభం కావడంతో జూరాల నుంచి భూత్పూరు రిజర్వాయర్‌కు నీరు వదలడంతో ఎప్పుడు కాల్వకు సాగునీరు వదిలినా.. పూడిక తీయించడంలేదు. దీంతో నీరు ముందుకు సాగడం లేదు. రైతుల విన్నపం మేరకు పట్టణానికి చెందిన దేశాయి ప్రకాష్‌ రెడ్డి చెరువుకు సాగునీరు అందాలన్న లక్ష్యంతో సొంతంగా జేసీబీతో కాల్వలో పూడికతీత పనులు కొనసాగిస్తున్నారు. దీంతో చెరువు ఆయకట్టు రైతులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు.

యోగాతో సంపూర్ణ ఆరోగ్యం

కొత్తకోట రూరల్‌: ప్రతిఒక్కరూ యోగా చేయాలని, యోగాతోనే సంపూర్ణ ఆరోగ్యం కలుగుతుందని శిశుమందిర్‌ మాజీ ప్రధానాచార్యులు బాదం వెంకటేశ్వర్లు అన్నారు. అంతర్జాతీయ యోగా దినోత్సవాన్ని పురస్కరించుకుని ఆయన మాట్లాడారు. ప్రాథమిక విద్య స్థాయి నుంచి విద్యార్థులకు యోగా శిక్షణా కార్యక్రమంలో భాగంగా ఒక క్లాస్‌ ఏర్పాటు చేసి వారితో ఆత్మస్థైర్యం, ఏకాగ్రత, పట్టుదల, జిజ్ఞాస పెంపొందేలా ప్రోత్సహించాలన్నారు. మనస్తత్వ పరిజ్ఞానం కల్పించి భవిష్యత్‌లో ఆత్మహత్యల నివారణకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు తగు చర్యలు తీసుకోవాలని కోరారు. యోగా చేసేందుకు ప్రతి పాఠశాలకు ఓ యోగా టీచర్‌ నియామకం చేపట్టాలన్నారు.

ఎమ్మార్సీలో వృథాగా కంప్యూటర్లు



పాన్‌గల్‌: మండల కేంద్రంలోని ఎమ్మార్సీ(ఎంఈఓ) కార్యాలయానికి కంప్యూటర్లు వచ్చి నెలలు గడుస్తున్నా వాటిని బిగించకపోవడంతో వృథాగా పడి ఉన్నాయి. సాంకేతికంగా రోజు రోజుకు పెరుగుతున్న మార్పులకు అనుగుణంగా విద్యాశాఖ చర్యలు తీసుకుంటోంది. క్షేత్ర స్థాయి నుంచి వివరాలు వేగంగా ఆన్‌లైన్‌లో నమోదు చేయడం కోసం సర్వశిక్షా అభియాన్‌ ద్వారా ఎమ్మార్సీకి ప్రత్యేకంగా ఆరు కంప్యూటర్లు మంజూరయ్యాయి. కంప్యూటర్లతో పాటు ప్రింటర్లు, 2 కేవీవీఏల యూపీఎస్‌, స్విచ్‌బోర్డులు, కేబుల్‌ వైర్లు తదితర సామగ్రిని అందించారు. వచ్చిన కంప్యూటర్లు, సామగ్రిని కార్యాలయంలో బిగించాల్సి ఉండగా.. నేటికి వాటిని బిగించకపోవడంతో వృథాగా ఉన్నాయి. ఎమ్మార్సీ కార్యాలయంలో ఉండే ఎంఐఎస్‌ కోఆర్డినేటర్లు, సీఆర్పీలు, ఇతర సిబ్బంది అంతా ఎమ్మార్సీ కార్యాలయంలో విధులు నిర్వహిస్తున్నారు. ఎమ్మార్సీ కార్యాలయంలో రెండు, మూడు కంప్యూటర్లు ఉండటంతో వివరాల నమోదుకు ఇబ్బందులు ఎదురవుతున్నాయి. దీంతో కొన్ని పనులకు జాప్యం ఏర్పడుతుంది. దీనిని గుర్తించిన విద్యాశాఖ ఎమ్మార్సీ కార్యాలయానికి ఆరు కంప్యూటర్లను గత విద్యాసంవత్సరం చివరిలో వచ్చాయి. కార్యాలయంలో వీటి ఏర్పాటుతో సీఆర్పీలు సైతం వారి పరిధిలోని సర్వే వివరాలను నేరుగా నమోదు చేసే అవకాశం ఉంటుందని అధికారులు పేర్కొంటున్నారు. ఈ విషయాన్ని ఎంఈఓ లక్ష్మణ్‌నాయక్‌ను వివరణ కోరగా.. కార్యాలయానికి వచ్చిన కంప్యూటర్లు బిగింపు ఈ విషయాన్ని మరోమారు జిల్లా అధికారులకు నివేదిచి వాటిని ఏర్పాటు చేసేలా తగు చర్యలు తీసుకుంటామన్నారు.